నేడు క్రైస్తవ వివాహ పరిచయ వేదిక

పోచారం: క్రిస్టియన్‌ హోలీ మ్యాట్రిమోనీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని వైఎంసీఏలో శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ప్రొఫైల్స్‌తో వేదిక వద్దకు రావాలని, ఇతర వివరాలకు 7330957771, 7075917771 ఫోన్‌ నెంబర్లలో సంప్రదించ వచ్చన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్‌: తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2025–2026 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎదులాబాద్‌లోని లలిత కళల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ రాములు తెలిపారు. నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 21 నుంచి, 1 ఫిబ్రవరి 2025 వరకు ఆన్‌లైన్‌లో రూ. 100 రుసుముతో దరఖాస్తు చేసుకోవాలని, ఒక ఫోన్‌ నెంబర్‌ ఒక దరఖాస్తుకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థుల ఎంపిక పాత జిల్లా యూనిట్‌గా పరిగణించబడుతుందని, అభ్యర్థికి బదులు వేరే వారి ఫొటో దరఖాస్తు చేసిన వారిపై క్రిమినల్‌ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్‌ 040–23391598, టీజీటీడబ్ల్యూఆర్‌ఈఐఎస్‌ 9491063511, ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్‌ 040–23328266, టీజీఆర్‌ఈఐఎస్‌ 040–24734899 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

మంత్రిని కలిసిన రైతులు



వ్యవసాయశాఖ మంత్రి నాగేశ్వర్‌రావును కలిసిన అంజిరెడ్డి, రైతులు

ఘట్‌కేసర్‌: రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును శుక్రవారం కలిశారు. అంతకు ముందు రైతు దినోత్సవం సందర్భంగా ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన డైమండ్‌ జూబ్లీ వేడుకల్లో మంత్రితో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రాజు, పెంటారెడ్డి పాల్గొన్నారు.

‘ప్రగతిచక్ర’ పురస్కారాల అందజేత



మేడ్చల్‌: మేడ్చల్‌ ఆర్టీసీ డిపోలో నవంబర్‌ నెలలో తమ విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు యాజమాన్యం ప్రగతిచక్ర పురస్కారాలు అందజేసింది. ప్రతి నెల లాగే ఆర్టీసీ డ్రైవర్లు, శ్రామికులు, కండక్టర్లను ఎంపిక చేసి ప్రగతి చక్ర పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. సికింద్రాబాద్‌ రీజియన్‌ మేనేజర్‌ రాజశేఖర్‌, పురస్కారాలు పొందిన ఉద్యోగులను అభినందించి సన్మానించారు. కార్యక్రమం సందర్భంగా డిపో ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం కవితరూపుల, రీజియన్‌ ఏఈ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ నాయకుల ముందస్తు అరెస్ట్‌

మేడ్చల్‌: మాజీ మంత్రి కేటీఆర్‌ అరెస్ట్‌ వార్తల నేపథ్యంలో మేడ్చల్‌లో బీఆర్‌ఎస్‌ నాయకులను పోలీసులు శుక్రవారం ఉదయం ముందస్తు అరెస్టులు చేశారు. ప్రధాన బీఆర్‌ఎస్‌ నాయకులు కేటీఆర్‌ నివాసంకు వెళ్లకుండా వారిని ఉదయాన్నే వారి ఇళ్ల వద్దనే అరెస్ట్‌ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అయిన వారిలో బీఆర్‌ఎస్‌ నాయకులు భాస్కర్‌యాదవ్‌, విష్ణుచారి, నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు కోర్టు భవనాలకు శంకుస్థాపన

మేడ్చల్‌: అత్వెల్లిలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న న్యాయస్థానాలకు శాశ్వత భవనాలు మంజూరు కావడంతో భవన నిర్మాణాలకు నేడు న్యాయమూర్తులు శంకుస్థాపన చేస్తారని బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి తెలిపారు. మేడ్చల్‌ న్యాయస్థానాల ఆవరణలో ఒకటవ అడిషనల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి, మూడవ అడిషనల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి న్యాయస్థానాల భవనాలకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్‌ జడ్జిహైకోర్టు జడ్జి అభినందన్‌ కుమార్‌షావీలీ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు.

కాలేజీ హాస్టల్స్‌లో తనిఖీలు

పోచారం: రానున్న నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఇంజనీరింగ్‌ కళాశాలల సమీపంలోని హాస్టల్స్‌లో పోచారం ఐటీ కారిడాల్‌ పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. సీఐ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రమించారు.. సాధించారు!

• మేడ్చల్‌ మండలంలో పలువురికి గ్రూప్‌–4 ఉద్యోగాలు • నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తున్న వైనం..

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న సంకల్పంతో విజయమే లక్ష్యంగా ముందుకు సాగిన పలువురు నిరుద్యోగుల కల సాకారమైంది. ఉమ్మడి మేడ్చల్‌ మండలంలోని పలు గ్రామాలకు చెందిన అభ్యర్థులు గ్రూప్‌–4లో ప్రతిభ కనబర్చి ఉద్యోగాలు సాధించారు. ఇటీవల ప్రభుత్వం వారికి నియామక పత్రాలు అందజేయగా జూనియర్‌ అసిస్టెంట్‌, వార్డు ఆఫీసర్‌ ఉద్యోగులుగా నియమితులయ్యారు. వీరిని చూసి ఆయా ప్రాంతాల్లోని యువతీ యువకులు స్ఫూర్తి పొందుతున్నారు.

–మేడ్చల్‌ రూరల్‌

డిగ్రీ చదివి.. జాబ్‌ కొట్టి



రోహిత్‌

మేడ్చల్‌ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉండే రోహిత్‌ డిగ్రీ పూర్తి చేశాడు. మొదటి ప్రయత్నంగా గ్రూప్‌–4 ఉద్యోగానికి దరఖాస్తు చేసి ఉద్యోగ సాధనే లక్ష్యంగా నిరంతరం కృషి చేసి విజయం సాధించాడు. జూనియర్‌ అసిస్టెంట్‌గా నియామక పత్రాన్ని అందుకుని మేడ్చల్‌ మున్సిపల్‌ కార్యాలయంలో విధుల్లో చేరాడు. మొదటి ప్రయత్నంలోనే ప్రభుత్వ ఉద్యోగం రావడంతో ఎంతో సంతోషంగా ఉందని ఆయన ఆనందం వ్యక్తపరిచారు.

వైఫల్యాల నుంచే విజయం



రాజుబాబు

మండలంలోని రాజబొల్లారం గ్రామానికి చెందిన యువకుడు రాజుబాబు ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో పలుమార్లు దరఖాస్తు చేసుకున్నాడు. కానిస్టేబుల్‌, ఎస్‌ఐ ఉద్యోగ పరీక్షల్లో కొద్ది పాటి తేడాతో ఉద్యోగం దక్కలేదు. అయినా పట్టువదలని విక్రమార్కుడిగా కష్టపడి గ్రూప్‌–4 ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం మేడ్చల్‌ మున్సిపల్‌ కార్యాలయంలో వార్డు ఆఫీసర్‌గా విధుల్లో చేరాడు.

తొలి ప్రయత్నంలోనే...



వర్గంటి రేఖ

మండలంలోని పూడూర్‌ గ్రామానికి చెందిన వర్గంటి రేఖ ఎంటెక్‌ పూర్తి చేసింది. సీఎంఆర్‌ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తూనే..ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో గ్రూప్‌–4 ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుంది. మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో సన్నద్ధమై పరీక్ష రాసి మంచి ఫలితం సాధించింది. జూనియర్‌ అసిస్టెంట్‌ ఉద్యోగం సొంతం చేసుకుంది. మెదక్‌ జిల్లా పరిధిలో తెలంగాణ ట్రైబల్‌ వెల్ఫేర్‌ రెసిడెన్షియల్‌ సొసైటీలో చోటు సంపాదించింది.

కానిస్టేబుల్‌ టూ గ్రూప్‌–4



నిమ్మల ప్రవీణ్‌



కావలి శివకుమార్‌



అరుణ్‌

మేడ్చల్‌ మున్సిపాలిటీ పరిధి పూడూర్‌ గ్రామానికి చెందిన నిమ్మల ప్రవీణ్‌ కుమార్‌, కావలి శివకుమార్‌లు గతంలో పోలీస్‌ కానిస్టేబుల్‌ ఉద్యోగాలు సాధించి విధుల్లో చేరారు. మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించినప్పటికీ..మరింత ఉన్నత స్థానాల్లో నిలవాలని భావించి గ్రూప్‌ పరీక్షలకు దరఖాస్తు చేశారు. ఇటీవల గ్రూప్‌–4 ఫలితాల్లోనూ విజయం సాధించారు. నిమ్మల ప్రవీణ్‌కుమార్‌కు కమర్షియల్‌ ట్యాక్స్‌ శాఖలో జూనియర్‌ అసిస్టెంట్‌ పోస్టు రాగా, శివకుమార్‌ను వార్డు ఆఫీసర్‌ పోస్టు వరించింది. మేడ్చల్‌కు చెందిన అరుణ్‌ సైతం ఏఆర్‌ కానిస్టేబుల్‌ ఉద్యోగం చేస్తూనే..గ్రూప్‌–4లో వార్డు ఆఫీసర్‌ ఉద్యోగం సాధించాడు.

మున్సిపల్‌ కౌన్సిల్‌ సమావేశం



కీసర: దమ్మాయిగూడ మున్సిపల్‌ను అందరి సహకారంతో ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ప్రణీతాశ్రీకాంత్‌గౌడ్‌ అన్నారు. శుక్రవారం నిర్వహించిన మున్సిపల్‌ కౌన్సిల్‌ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్‌ పరిధిలోని 18 వార్డుల్లో కౌన్సిలర్ల సూచన మేరకు అభివృద్ధి పనులకు నిధులను కేటాయించడం జరుగుతుందన్నారు. కాగా మున్సిపల్‌ పరిధిలోని కుందన్‌పల్లి రామలింగేశ్వర నగర్‌లో గల నర్సరికి ప్రీకాస్ట్‌ కాంపౌండ్‌ వాల్‌ ఏర్పాటు చేయుటకు రూ. 15 లక్షలు, కీసరలోని డబుల్‌బెడ్‌రూం ఇండ్లకు మిషన్‌ భగీరథ పైప్‌లైన్‌ ఏర్పాటుకు రూ. 5 లక్షల నిధులు, కీసర బీసీ గురుకుల పాఠశాల వద్ద లైట్స్‌ ఏర్పాటుతోపాటు, వివిధ సౌకర్యాల కల్పనకు రూ. 5 లక్షలు, మరో రూ. 3 లక్షల నిధులతో భూగర్భ మురికికాలువ నిర్మాణ, మున్సిపల్‌కు సంబంధించి జిరాక్స్‌, స్టేషనరీ కొనుగోలు నిమిత్తం నిధులు కేటాయించాలని సమావేశంలో నిర్ణయించడం జరిగిందన్నారు. సమావేశంలో కమిషనర్‌ నాగమణి, వైస్‌ చైర్మన్‌ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, డి.ఈ.ఈ బాల మురళి, మేనేజర్‌, కౌన్సిలర్లు, కో ఆప్షన్‌సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో క్రిస్మస్‌ వేడుకలు



సాక్షి,సిటీబ్యూరో: క్రిస్మస్‌ పండుగ సందర్భంగా శుక్రవారం మేడ్చల్‌ కలెక్టరేట్‌ కార్యాలయంలో క్రిస్మస్‌ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో కలెక్టరేట్‌ ఏఓ రామ్మోహన్‌ శాంటాక్లాస్‌ వేషధారణలో ఉన్న చిన్నారులతో కలిసి క్రిస్మస్‌ కేక్‌ కట్‌ చేశారు. బైబిల్‌లోని క్రీస్తు పుట్టుక తదితర విషయాలపై ప్రవచనాలు చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థి జీవితంలో ఆటలు అవసరం





స్పోర్ట్స్‌ మీట్‌ ప్రారంభిస్తున్న ఎంఆర్‌జీఐ డైరెక్టర్‌ శాలినిరెడ్డి , స్పోర్ట్స్‌ మీట్‌లో విద్యార్థులు

మేడ్చల్‌రూరల్‌: విద్యార్థి జీవితంలో చదువుతో పాటు ఆటలు అవసరమని మల్లారెడ్డి గ్రూప్స్‌ డైరెక్టర్‌ శాలిని రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్‌ కళాశాలలో రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్‌ మీట్‌ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు తమను తాము రక్షించుకోవడానికి స్వీయ రక్షణ పద్ధతులను మెరుగు పరుచుకోవాలన్నారు. స్పోర్ట్స్‌ మీట్‌లో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌, టేబుల్‌ టెన్నిస్‌, బాస్కెట్‌ బాల్‌, త్రో బాల్‌ పోటీలను నిర్వహిస్తున్నామని, పోటీల్లో వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్‌ మాధవిలత తెలిపారు. విద్యార్థినులు చదువుతో పాటు క్రీడా రంగంలో ప్రోత్సహించేందుకు ప్రతీ ఏటా స్పోర్ట్స్‌ మీట్‌ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం: మేయర్‌ శాంతి



జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ అభివృద్ధియే ముఖ్య లక్ష్యమని మేయర్‌ శాంతి అన్నారు. జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ పరిధిలోని 22 డివిజన్‌ కార్పొరేటర్‌ లావణ్యసతీష్‌గౌడ్‌ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్‌ సాధారణ నిధులు రూ.5 లక్షలతో బీరప్పగడ్డలో భూగర్భ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సాయికుమార్‌, వేణు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం

శామీర్‌పేట్‌: డా. అంబేడ్కర్‌ పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం ఉమ్మడి శామీర్‌పేట మండల వ్యాప్తంగా మాలమహానాడు ఆధ్వర్యంలో కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. శామీర్‌పేట మండలం, అలియాబాద్‌ గ్రామంతో పాటు శామీర్‌పేట తహసీల్దార్‌ కార్యాలయం ఎదుట అంబేడ్కర్‌ విగ్రహం వద్ద అమిత్‌షా దిష్టి బొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో మాలమహానాడు శామీర్‌పేట మండల అధ్యక్షుడు నాగరాజు, దళితసేన మండల ప్రధాన కార్యదర్శి బాలేష్‌, బాలు, రమేష్‌, సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో లైట్లు ఏర్పాటు

ఘట్‌కేసర్‌: మున్సిపాలిటీలోని గుంటిగూడెంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయంలో విద్యుత్‌ దీపాలు వెలుగక ఇబ్బందులు అవుతున్నాయన్న స్థానికుల విన్నపం మేరకు లోఓల్టేజ్‌ సమస్యతో చెడిపోయిన 15 విద్యుత్‌ లైట్లను సొంత ఖర్చుతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ మాట్లాడుతూ.. గ్రామాల్లో విద్యుత్‌ లైట్ల ఏర్పాటు, విద్యుత్‌ సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, జంగయ్యయాదవ్‌, మున్సిపల్‌ కార్మికులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య

ఘనంగా సెమీ క్రిస్మస్‌ వేడుకలు



కేక్‌ కట్‌ చేస్తున్న వెంకటేశ్వర్లు, పాస్టర్లు

జవహర్‌నగర్‌: జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ గబ్బిలాల్‌పేటలో యేసు అగ్నిజ్వాల మినిస్ట్రీస్‌ ఆధ్వర్యంలో శుక్రవారం సెమీ క్రిస్మస్‌ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్‌ఎస్‌ రాష్ట్ర అధ్యక్షులు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు హాజరైయారు. 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్‌ జాన్‌, బొల్లా పద్మారావు ముదిరాజ్‌, నరేందర్‌, నగేష్‌, పరమేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ నిరసన



మేడ్చల్‌: పార్లమెంట్‌ సాక్షిగా రాజ్యాంగ నిర్మాణ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను చేసిన ఘటనకు నిరసనగా మేడ్చల్‌లో కాంగ్రెస్‌ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్‌ విగ్రహాన్ని పాలతో అభిషేకం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నాయకులు నిరసన కొనసాగించి అంబేడ్కర్‌ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు రమణారెడ్డి, వరదారెడ్డి, బాలమల్లేష్‌, సురేందర్‌ ముదిరాజ్‌, రవిముదిరాజ్‌, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ, మహేష్‌, రాజు, శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

ఘట్‌కేసర్‌: అవుషాపూర్‌ బ్రహ్మంగారి ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని బ్రహ్మంగారి ఆలయంలో నిత్యం పూజ నిర్వహించే వ్యక్తి గురువారం రాత్రి తాళం వేసి ఇంటికెళ్లాడు. తిరిగి ఉదయం వేకువ జామున పూజ చేయడానికి ఆలయానికి వెళ్లగా ఆలయం గర్భగుడి తాళం పగులగొట్టబడి ఉంది. లోపలికి వెళ్లి చూడగా అమ్మవారి మెడలో ఉండాల్సిన బంగారు ఆభరణం, ఆలయంలో ఉండవలసిన హుండీ కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల వెతకడంతో.. సమీపంలో హుండీ పగులగొట్టి ఉంది. సంవత్సర కాలంగా డబ్బులు వేసి ఉన్న హుండీలో సుమారు రూ. 50 వేలు నగదు, అమ్మవారి బంగారు ఆభరణంను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారని పూజారి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చోరీ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హాస్టల్‌ వెల్ఫేర్‌ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి



సాక్షి,సిటీబ్యూరో: సంక్షేమ హాస్టళ్లలో అమలవుతున్న నూతన డైట్‌ విధానం (కామన్‌ మెనూ) అమలుతో హాస్టల్‌ వెల్ఫేర్‌ ఆఫీసర్లకు ఎదురవుతున్న క్షేత్ర స్థాయి సమస్యలను పరిష్కరించాలని మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌ గౌతమ్‌కు టీఎన్‌జీవోస్‌ జిల్లా కమిటీ కోరింది. ఈ మేరకు శుక్రవారం హాస్టల్‌ వెల్ఫేర్‌ ఆఫీసర్లకు ఎదురవుతున్న సమస్యలు, ఇబ్బందులపై రాతపూర్వకంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రవిప్రకాష్‌ అధ్వర్యంలో ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్‌ గౌతమ్‌ హాస్టల్‌ వెల్ఫేర్‌ ఆఫీసర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగలనని హామీ ఇచ్చినట్లు టీఎన్‌జీవోస్‌ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్‌ జిల్లా కార్యదర్శి భరత్‌ కుమార్‌, నాయకులు రజిని, హాస్టల్‌ వెల్ఫేర్‌ ఆఫీసర్ల కేంద్ర, జిల్లా ఫోరమ్‌ నాయకులు పాండు, సుధాకర్‌రెడ్డి, మద్దూరి మాణిక్యం, కమల్‌ దాస్‌ పాల్గొన్నారు.

ప్రజలకు చేరువలో ప్రభుత్వ వైద్యసేవలు



సాక్షి,సిటీబ్యూరో: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేలా జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ పబ్లిక్‌ హెల్త్‌ అండ్‌ ఫ్యామిలీ వెల్ఫేర్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ రవీంద్ర నాయక్‌ సూచించారు. శుక్రవారం నగరంలో మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌ఓ) డా. రఘునాథ్‌స్వామి మార్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డైరెక్టర్‌ డాక్టర్‌ రవీంద్రనాయక్‌ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మంచి సేవలను అందించటంలో మేడ్చల్‌ జిల్లా ముందంజలో ఉందని, ఈ ఒరవడిని కొనసాగించాలని అభినందంచారు. డైరెక్టర్‌గా ఏడాది కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న డాక్టరు రవీంద్రనాయక్‌కు ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టరు టి.రఘునాథ్‌స్వామిని ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు.

క్రీడలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రతినిధులు

ఘట్‌కేసర్‌: క్రీడలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని సంస్కృతి విద్యాసంస్థల డైరెక్టర్‌ మల్లాది రమాకాంత్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని కొండాపూర్‌ సంస్కృతి ఇంజనీరింగ్‌ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్‌ స్థాయి క్రీడా పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్రీడల్లో వాలీబాల్‌ బాలుర విజేతగా కేపీఆర్‌ఐటీ, కబడ్డీ బాలికల విజేతగా విజ్ఞాన్‌ ఉమెన్స్‌ కాలేజీ, బాడ్మింటన్‌ బాలుర విజేతగా సంస్కృతి ఫార్మసీ, బాలికల విజేతగా సంస్కృతి కాలేజీ, 100 మీటర్ల బాలికల పరుగు పందెంలో సంస్కృతి కాలేజీ, బాలుర విజేతగా వీబీఐటీ క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో సంస్కృతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌ శ్రవణ్‌, ఇంజనీరింగ్‌ ప్రిన్సిపాల్‌ జానకీరాములు, పాలిటెక్నిక్‌ ప్రిన్సిపాల్‌ శివకేశవరెడ్డి, నెహ్రూ యువ జిల్లా అధికారి ఐసయ్య, సమన్వయ కర్తలు విజయ్‌పాల్‌, హరిప్రసాద్‌, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి తదితరులు

కీసర: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ ఎంతగానో ఉపయోగపడుతుందని నాగారం మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్లచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపల్‌ పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన ముగ్గురికి మంజూరైన సీఎం రిలీఫ్‌ ఫండ్‌ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంతకుముందు మున్సిపల్‌ పరిధిలోని రామకృష్ణనగర్‌ రోడ్డునెంబర్‌ 16లో వాటర్‌ పైప్‌లైన్‌ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్‌ మల్లేష్‌యాదవ్‌, కౌన్సిలర్‌ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్‌ కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్‌ దీపికరెడ్డి

మేడ్చల్‌: మున్సిపాలిటీ పరిధిలో అవసరమైన రోడ్లు, డ్రైనేజీ ఇతర అవసరాలకు తగిన నిధులు కేటాయిస్తూ మున్సిపల్‌ కౌన్సిల్‌ ఆమోదం తెలిపింది. శుక్రవారం సాధారణ సర్వ సభ్య సమావేశం చైర్‌పర్సన్‌ దీపికనర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. వివిధ రోడ్లకు, ఇతర అవసరాలకు నిధులు కేటాయిస్తూ ఆమోదం తెలిపారు. సమావేశంలో వైస్‌ చైర్మన్‌ రమేష్‌, కమిషనర్‌ నాగిరెడ్డి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన రిలే నిరాహార దీక్షలు

ఘట్‌కేసర్‌: పట్టణంలోని రైల్వే వంతెన పనులు త్వరితగతిన నిర్మించాలని డిమాండ్‌ చేస్తూ 20 రోజులుగా ఏజేసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ముగిశాయి. టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్‌, మేడ్చల్‌ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పావనీజంగయ్య, బీ–బ్లాక్‌ అధ్యక్షుడు మహేష్‌గౌడ్‌ ఆధ్వర్యంలో వంతెన బాధితులతో చర్చలు జరిపారు. బాధితుల డిమాండ్ల మేరకు ఉన్నతాధికారులతో మాట్లాడి వంతెన పనులు పూర్తి చేయిస్తామని, భూనిర్వాసితులకు నష్టపరిహారంతో పాటు 100 గజాల ప్లాటు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, రోడ్డుకు ఇరువైపుల వెడల్పు చేసి ఆర్టీసీ బస్సులు పట్టణంలోకి రాకపోకలు సాగించేలా చూస్తామని హామి ఇచ్చారు. అనంతరం దీక్షలు చేపట్టిన వారికి పళ్ల రసం ఇచ్చి విరమింపజేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్‌, జేఏసీ చైర్మన్‌ లక్ష్మారెడ్డి, నాగరాజ్‌ముదిరాజ్‌, జంగయ్యయాదవ్‌, ఆంజనేయులు యాదవ్‌, కిరణ్‌, ప్రమోద్‌ గుప్తా, కమలాకర్‌, కౌన్సిలర్లు ఆంజనేయులుగౌడ్‌, నర్సింగ్‌రావు, వెంకట్‌రెడ్డి, జహంగీర్‌, నాయకులు నరేష్‌గౌడ్‌, విక్రమ్‌రెడ్డి, సిరాజ్‌, రహీం తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులాన్ని సందర్శించిన

అదనపు కలెక్టర్‌ రాధికా గుప్తా



మైనార్టీ గురుకులంలో.. విద్యార్థినీల ఆరోగ్య పరిస్థితిని అడుగుతున్న జిల్లా అదనపు కలెక్టర్‌ రాధికాగుప్తా

కీసర: నాగారం మున్సిపాలిటీలోగల మైనార్టీ గురుకులంను శుక్రవారం మేడ్చల్‌–మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్‌ సందర్శించారు. గురువారం సాయంత్రం మైనార్టీ గురుకులంకు చెందిన 33 మంది విద్యార్థినీలు ఫుడ్‌ పాయిజన్‌తో అస్వస్థతకు గురై ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే. ఘట్‌కేసర్‌ ఆసుపత్రిలో చికిత్స అనంతరం శుక్రవారం డిశ్చార్జ్‌ అయి నాగారం గురుకులంకు చేరుకున్న విద్యార్థినీల ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. అస్వస్థతకు గురై చికిత్స పొందిన విద్యార్థినీలందరు కొలుకుంటున్నారని అధికారులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థులందరికి నాణ్యతతోకూడిన పౌష్టికాహారాన్ని అందజేయాలని అదనపు కలెక్టర్‌ గురుకుల ప్రిన్సిపాల్‌ స్వప్నతోపాటు, వార్డన్‌కు సూచించారు. మరోవైపు నాగారం మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి, మరికొంత మంది బీజేపీ నేతలు అస్వస్థతకు గురైన విద్యార్థినీలను పరామర్శించేందుకు రాగా పోలీసులు వారిని అనుమతించలేదు. గురుకులం వద్ద కీసర సీఐ. వెంకటయ్య ఆధ్వర్యంలో పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజకీయ పార్టీల నేతలను ఎవ్వరిని గురుకులంలోకి అనుమతించలేదు.